

32 మేక పిల్లల మృతి



ముదిగుబ్బ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షానికి మండలంలోని పొడరాళ్లపల్లి వాసి రామ్మోహన్‌కు చెందిన 32 మేక పిల్లలు మృతిచెందాయి. దీంతో రూ.2లక్షలదాకా నష్టం వాటిల్లింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలతో వాగులు, వంకలు నిండుగా పారుతున్నాయనీ, లోతట్టుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఎగువప్రాంతమైన కర్ణాటకలో భారీ వర్షాలతో జిల్లాలో వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయన్నారు. భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయండి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్: జిల్లావ్యాప్తంగా రానున్న నాలుగురోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో పోలీసు అధికారులు.. అన్నిశాఖల సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రత్న మంగళవారం ప్రకటనలో ఆదేశించారు. వాగులు, వంకలు, చెరువుల మరువలు ప్రమాదకర స్థాయిలో ప్రవహించే అవకాశం ఉందన్నారు. దీంతో అన్నిశాఖల సమన్వయంతో ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాతబడిన ఇళ్లలో నివసించేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సంచాలకుడు శివరంగ ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు http://jnanabhumi.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



చిలమత్తూరు మండలం కోడూరు వద్ద కుషావతి నది వంతెనపై నుంచి ప్రవహిస్తుండటంతో విద్యార్థులను సురక్షితంగా ఇళ్లకు పంపుతున్న పోలీసులు, టీచర్లు



పెనుకొండ మండలం గుట్టూరు వద్ద నీటిలో చిక్కుకున్న బస్సు




బత్తలపల్లి మండలం సంగమేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

వర్ష బీభత్సం...

వాన వెల్లువైంది. జిల్లా అంతటా కుంభవృష్టి కురిసింది. సోమవారం రాత్రి నుంచి దంచికొట్టింది. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంటలను ముంచెత్తాయి. రోడ్లను ముంచెత్తడంతో ప్రజారవాణా వ్యవస్థ స్తంభించి పోయింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. కనగానపల్లిలో అత్యధికంగా 198.2 మి.మీ. రికార్డు వర్షపాతం నమోదైంది.

- పుట్టపర్తి/పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి)

- జిల్లా అంతటా కుండపోత
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- మరువలు పారిన చెరువులు
- నదులకు వరద
- 44వ జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంటలు
- అన్నదాతకు తీవ్ర నష్టం
- సినీ హీరో నాగార్జునకు వరద కష్టాలు



పుట్టపర్తి వద్ద చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న చిత్రావతి



పెనుకొండ మండలం సత్తారుపల్లి రైతు రఘునాథ రెడ్డి సాగుచేసిన ఉల్లి దిగుబడి కొట్టుకుపోయిన దృశ్యం

● భారీ వర్షాలకు రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి చెరువు కట్ట తెగిపోయింది. ఆయకట్టులో సాగు చేసిన వరి పంట కొట్టుకుపోయింది. చెరువు తెగి పండమేరులోకి వరద ఉధృతి పెరిగింది.

● కనగానపల్లి మండలంలోని ముక్తాపురం చెరువు పొంగిపొర్లడంతో 44వ జాతీయ రహదారిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● పెనుకొండ మండలం వెంకటగిపాళ్యం చెరువు మరవ ఉధృతంగా పారడంతో గుట్టూరు సమీపాన జాతీయ రహదారిపైకి పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది.

● పెనుకొండ, పుట్టపర్తి, సోమందేపల్లి కొండల్లో కురిసిన భారీ వర్షానికి కొడపగానిపల్లి సమీపంలో వంగపేరు పొంగిపొర్లింది. కొత్తచెరువు-ధర్మవరం ప్రధాన రహదారిలో మధ్యాహ్నం దాకా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

● పెన్నా, చిత్రావతి, కుషావతి, జయమంగళి జలకలను సంతరించుకున్నాయి.

● చెన్నేకొత్తపల్లి మండలంలోని హరియాన్‌చెరువు మరువ ఉధృతంగా పారడంతో 66 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. మోటుమర్ల, గొట్లూరు, పోట్లమర్రి వద్ద బిడ్జిలపై వరద నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కల్గింది.

● చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించడంతో రాచువారిపల్లి, పుట్టపర్తి- కర్నాటకనాగేపల్లి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బత్తలపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద చిత్రావతి నది ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది.

● ధర్మవరంలో మగ్గం గుంతల్లోకి పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో ఉపాధి కోల్పోతున్నామని చేనేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వాగులు, వంకలు పొంగి పొర్లడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. మంగళవారం రాత్రికి వర్షం కురిస్తే వదర ముంచెత్తే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగం హెచ్చరికలు జారీ చేస్తోంది.

● వర్షాలకు జిల్లాలో 48 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వెటర్నరీ ఆస్పత్రులు దెబ్బతిని రూ.25 లక్షలు నష్టం వాటిల్లిందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. పాడిపశువులు మూడు మరణించాయి.

సినీ హీరో నాగార్జునకు వరద కష్టాలు

అనంతపురంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు సినీ హీరో నాగార్జున మంగళవారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రత్యేక విమానంలో దిగారు. అక్కడి నుంచి అనంతపురానికి రోడ్డుమార్గంలో బయల్దేరారు. కొత్తచెరువు-ధర్మవరం ప్రధాన రహదారి కొడపగానిపల్లి సత్యసాయి వాటర్ పంప్ వద్ద వంగపేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో నాగార్జున దారి మళ్లి పెనుకొండ జాతీయ రహదారి మీదుగా అనంతపురం వెళ్లారు. వెంకటగిరి పాళ్యం చెరువు మరువ నీరు గుట్టూరు వద్ద జాతీయ రహదారిని ముంచెత్తింది. ఈ మార్గంలో ట్రాఫిక్ అంతరాయంతో నాగార్జున కాసేపు గుట్టూరు వద్ద ఆగి ముందుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుట్టూరు, కొత్తచెరువు మీదుగా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు.

నేలవాలిన పంటలు

జిల్లావ్యాప్తంగా వర్ష బీభత్సానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 1164 హెక్టార్లలో వరి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, పత్తి, 44 హెక్టార్లలో టమోటా, అరటి, బంతిపూలు, మిర్చి, ద్రాక్ష, ఉల్లి, చిక్కుడు, వంగ తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంట నష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ప్రాథమికంగా నివేదిక రూపొందించాయి. కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, హిందూపురం, లేపాక్షి, తాడిమర్రి, బుక్కపట్నం, ముదిగుబ్బ తదితర మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కనగానపల్లి మండలంలో జిల్లాలోనే ఈ ఏడాది అత్యధికంగా 600 ఎకరాల్లో వరి, వేరుశనగ, టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ఈనెల 15 నుంచి 18 దాకా అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలకు పలుపంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజాగా భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా కోత దశలో ఉన్న పంటలు నేలవాలాయి. దీంతో రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో చాలా గ్రామాల్లో పొలాల వైపు రైతులు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయలేదు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు పంట నష్టాన్ని తేల్చేందుకు కుస్తీ పడుతున్నారు.

నన్నే పోలీసు స్టేషన్‌కు రమ్మంటారా?

ఎస్‌ఐపై ఉష శ్రీచరణ్ చిందులు



పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఉషశ్రీ

గోరంట్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ.. ఎస్ఐ శ్రీనివాసులుపై మంగళవారం పోలీసు స్టేషన్‌లోనే చిందులు తొక్కారు. 'నన్నే పోలీసు స్టేషన్‌కు రమ్మంటారా..' అంటూ చెలరేగిపోయారు. మండలంలోని గడ్డం తండాలో ఈనెల 19వ తేదీ రాత్రి పెళ్లి ఊరేగింపులో మద్యం తాగి భారీ శబ్దంతో పాటలు పెట్టి, సందడి చేశారు. తండావాసులకు ఇబ్బంది కలగడంతో లక్ష్మీరాంనాయక్ అనే వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో అతడిని కొట్టారు. అతడి భార్య మౌనికాబాయి అడ్డురాగా ఆమెపై కూడా చేయి చేసుకున్నారు. అక్కడికెళ్లిన పోలీసుల పట్ల గిరిజనులు దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. మౌనికాబాయి ఫిర్యాదు మేరకు ఆరుగురు తండా వాసులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈవిషయంపై ఉషశ్రీ మంగళవారం ఉదయం ఎస్ఐ శ్రీనివాసులుకు ఫోన్ చేశారు. ఆమె ఎఫ్ఐఆర్‌లోని పేర్లను అడగ్గా.. చెప్పేందుకు ఎస్ఐ నిరాకరించారు. ఫోన్‌లో చెప్పడానికి వీలుకాదనీ, స్టేషన్‌కు వచ్చి తీసుకోవాలని చెప్పారు. దీంతో ఆమె మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన అనుచరులతో స్టేషన్‌కు వచ్చి, ఎస్ఐపై మండిపడ్డారు. సీఐ శేఖర్ సమక్షంలోనే ఎస్ఐ శ్రీనివాసులుపై చిందులేశారు. తాను మర్యాదపూర్వకంగానే సమాధానమిచ్చానని ఎస్ఐ తెలిపారు. స్టేషన్ వద్ద ఆందోళనకు సిద్ధమయ్యారు. తండావాసులు చేసిన దౌర్జన్యానికి సంబంధించిన వీడియో చూడాలని పోలీసులు పట్టుబట్టారు. ఉషశ్రీ పట్టించుకోకుండా ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పోలీసులకు చెప్పి వెళ్లిపోయారు.

సైబర్ వల



- మీ పిల్లలు డ్రగ్స్‌తో దొరికారంటూ కాల్స్
- సీబీఐ పేరుతో బెదిరింపులు
- అడిగినంత ఇస్తే వదిలేస్తామంటూ ఫోన్లు
- పోలీసు, సీబీఐ అధికారుల బంధువులకే టోకరా వేసే ప్రయత్నం

హిందూపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకున్న కొంతమంది సైబర్ నేరగాళ్లు కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారు. కొందరు ఫోన్‌కాల్స్‌తో ఖాతాలు ఖాళీ చేస్తుండగా.. మరికొంత మంది ఓటీపీ నంబరుతో నగదు దోచుకుంటుండగా మరికొంతమంది తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అంటూ ఆశచూపి నగదు కొట్టేస్తున్నారు. తాజాగా హిందూపురం ప్రాంతంలో కొంతమందికి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి ఏకంగా సీబీఐ అధికారులమంటూ మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారు. 'మీ పిల్లలు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారనీ, ప్రస్తుతం అరెస్టు చేశామనీ, అడిగినంత ఇస్తే ఓకే, లేదంటే రిమాండ్‌కు తీసుకెళ్తున్నామ'ని ఫోన్‌కాల్స్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. నెల క్రితం హిందూపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఫోన్‌చేసి 'నీ కుమారుడు డ్రగ్స్‌తో పట్టుబడ్డాడనీ, బెంగళూరులో అదుపులోకి తీసుకున్నామనీ, స్నేహితులతో కలిసి ఉండటంతో దొరికిపోయాడని చెప్పారు. దీంతో ఆయన ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఆయన కుమారుడు బెంగళూరులో చదువుతున్నాడు. పైగా సీబీఐ అధికారులమంటూ వాట్సాప్ కాల్ చేశారు. అందులో పోలీసు అధికారి డీపీ కూడా ఉండటంతో ఆందోళన చెందాడు. నిజమేనేమోనని కుమారుడికి ఫోన్‌చేయగా.. స్విచాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మరింత ఆందోళనకు లోనయ్యారు. చేసేదిలేక ఇంటిల్లిపాదీ ఏడుస్తూ కూర్చున్నారు. సైబర్ నేరగాళ్లు మరోసారి ఫోన్‌చేసి తాము అడిగినంత డబ్బు ఇస్తే వదిలేస్తామనీ, లేదంటే రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. వారు అడిగినంత ఇచ్చే స్థోమత వారికి లేదు. విషయాన్ని బంధువులకు చెప్పారు. వారిలో ఒకరు పోలీసు అధికారి కావడంతో ఆయన వెంటనే ఆ నంబరు తీసుకుని, పరిశీలించగా ఫేక్‌కాల్ అని తేలింది. కుమారుడు చదువుతున్న కళాశాలకు ఫోన్‌చేయగా క్లాస్‌రూమ్‌లో ఉన్నాడని చెప్పారు. దీంతో ధైర్యం తెచ్చుకున్నారు. నెలరోజుల పుడు హిందూపురం పట్టణంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓ వ్యక్తికి ఫోన్ చేశారు. గోవా నుంచి సీబీఐ అధికారులు మాట్లాడుతున్నామన్నారు. 'మీ కుమారుడు డ్రగ్స్ వ్యాపారం చేస్తూ పట్టుబడ్డాడు. అతన్ని ఢిల్లీకి తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం. మేము అడిగినంత ఇస్తే ఓకే, లేదంటే రిమాండుకు తరలించడం ఖాయమ'ని చెప్పారు. దీంతో వారు డిమాండ్ చేసిన మొత్తం తమవద్ద లేదన్నారు. కనీసం తాము ఢిల్లీనుంచి గోవాకు రావడానికి సుమారు రూ.2లక్షలు ఖర్చయిందనీ, ఆ మొత్తమైనా ఇస్తే వదిలేస్తామన్నారు. చేసేదిలేక రూ.లక్ష వారు చెప్పిన నంబరుకు పంపారు. ఆ మొత్తం పంపిన 5 నిమిషాలకే కుమారుడు ఫోన్‌చేసి తాను బెంగళూరులో ఉన్నానని హిందూపురం వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో అవాక్కయిన కుటుంబ సభ్యులు మోసపోయామని గ్రహించి గొల్లుమన్నారు. 20రోజుల క్రితం హిందూపురం పట్టణం లక్ష్మీపురంలో నివాసముండే వారికి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి, 'మీ కుమారుడు డ్రగ్స్‌తో పట్టుబడ్డాడనీ, రూ.5లక్షలు ఇస్తే వదిలేస్తామనీ, లేదంటే అరెస్టు చేయడం ఖాయమనీ, ఏదో నిర్ణయించుకుని 10నిమిషాల్లో సమాధానం చెప్పాల'ని హుకుం జారీచేశారు. కొద్దిసేపటికి వారు తేరుకుని సమీప బంధువైన సీబీఐ అధికారికి ఫోన్‌చేసి విషయాన్ని తెలిపారు. ఇది ఫేక్ కాల్ అని నమ్మవద్దంటూ చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఓ పోలీసుకు కేరళ నుంచి సీబీఐ అధికారులు మాట్లాడుతున్నామని ఫోన్ చేశారు. 'మీ అమ్మాయి డ్రగ్స్‌తో పట్టుబడిందనీ, అరెస్టు చేయడానికి సిద్ధంగా ఉన్నామనీ, ఇక్కడ మీడియావారు సిద్ధంగా ఉన్నారనీ, మేం అడిగినంతా ఇస్తే ఓకే.. లేదంటే మీడియా ముందు ప్రవేశపెడతామ'ని తెలిపారు. ఆయన కుమార్తె కేరళలో లేదు. దీంతో ఆయన వెంటనే అలర్ట్ అయి ఫోన్‌లో ఇష్టానుసారంగా తిట్టడంతో ఫోన్ కట్‌చేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటి హిందూపురంలో రోజూ పది మందికి వస్తున్నట్లు సమాచారం.

ఉరుములకు భయపడి ప్రైవేటు టీచర్ మృతి



సూర్యనారాయణ (ఫైల్)

తాడిమర్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన ప్రైవేటు టీచర్ సాకే సూర్యనారాయణ సోమవారం రాత్రి ఉరుములకు భయపడి గుండెపోటుతో మరణించాడు. ఈయన బత్తలపల్లిలో నివాసముంటూ అక్కడే ప్రైవేటు పాఠశాలలో ట్యూషన్ టీచర్‌గా పనిచేస్తుండేవారు. ఆదివారం టెట్ పరీక్ష రాసేందుకు కడపకు వెళ్తూ 5 నెలల గర్భిణి అయిన భార్య లక్ష్మీదేవిని, కుమార్తెలను స్వగ్రామం కునుకుంట్లకు పంపారు. పరీక్ష రాసి, తిరిగి కునుకుంట్లకు వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో బాత్‌రూంకు అని బయటకు వచ్చినపుడు భారీ శబ్దంతో ఉరుము వచ్చింది. దీంతో భయపడిపోయారు. ఇంట్లోకి వెళ్లి ఛాతీలో నొప్పిగా ఉందంటూ కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.



రాప్తాడు మండలంలో నీట మునిగిన వరి పైరు





టీవీ టవర్ ఆటోనగర్ వద్ద ఇళ్లు నీట మునగడంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు



ఉప్పరపల్లి జగనన్నకాలనీలో ఓ కొట్టంపై సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుడు



నీట మునిగిన ఉప్పరపల్లి జగనన్న కాలనీ

జిల్లాలో భారీ వర్షం

అతలాకుతలం

తెగిన కనగానపల్లి చెరువు
నీట మునిగిన పంటలు, ఇళ్లు
భారీగా పంట, ఆస్తి నష్టం
పరిశీలించిన అధికారులు

అనంతపురంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కుంభవృష్టి కురిసింది. రాప్తాడు మండలంలోని బండమీదపల్లి చెరువు నిండి పొంగి పొర్లడం, కనగానపల్లి చెరువుకు గండిపడటంతో పండమేరు వంక ఉగ్రరూపం దాల్చింది. దీంతో రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఉప్పరపల్లిలోని జగనన్న కాలనీ, గురుదాస్ కాలనీ, ఆటోనగర్ కాలనీలు నీటమునిగిపోయాయి. జగనన్న కాలనీలో దాదాపు నాలుగైదు అడుగుల ఎత్తువరకు నీరు వచ్చిచేరాయి. నగరశివారు అటవీ శాఖ వనమిత్ర వెనుకభాగంలో గుడిసెలన్నీ నీట మునిగి కొట్టుకుపోయాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు మునిగిపోయాయి. కొన్ని వాహనాలు కొట్టుకుపోయాయి. ఆయా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి, ధాన్యం గింజలు, దుస్తులు ఇతరత్రవన్నీ నీటిలో మునిగిపోయాయి.

అప్రమత్తమైన అధికారులు..

ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని కాలనీలు నీటి మునిగిన విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు తమ సిబ్బందితో ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. నీటమునిగిన ప్రాంతాల్లో ఉండిపోయిన ప్రజలను స్థానికుల సాయంతో జేసీబీలతో బయటకు తీసుకొచ్చారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస ప్రదేశాలకు తరలించారు. గ్రామంలోని వీరనాగమ్మ గుడి, ప్రభుత్వ పాఠశాల, ఆర్డీటీ స్టేడియం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో భోజనం ఇతరత్ర సౌకర్యాలు కల్పించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమేరకు మంగళవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలైన ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని కాలనీల్లో ఆయన పర్యటించారు. పరిస్థితిని అధికారులతో సమీక్షించి, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

దెబ్బతిన్న పంటలు..

భారీగా కురిసిన వర్షానికి మండలంలోని పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. ఉప్పరపల్లితో పాటు సోములదొడ్డి, పాములాయి, కందుకూరు, మన్నీల, చియ్యేడు, ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఎక్కువశాతం వరి పంట నెల కొరింది. మన్నీల, చియ్యేడు, కందుకూరులో వేరుశనగ పంట నీటమునిగింది. మండల వ్యాప్తంగా వరి 22హెక్టార్లు, వేరుశనగ 15హెక్టార్లలో దెబ్బతినట్లు ఏఓ శశికళ తెలిపారు.



నీట మునిగిన జగనన్న కాలనీ



ఎక్స్‌కవేటర్‌లో ఒడ్డుకు ముంపు బాధితులు



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ, పరిటాల శ్రీరామ్



నిండు కుండలా బండమీదపల్లి చెరువు

100 ఎకరాలకు పైగా నష్టం

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు, కాలువలు మరువ పారుతున్నాయి. బండమీదపల్లి చెరువు నిండి మరువ పారుతోంది. నీరు అధికం కావడంతో మరువ వద్ద కట్ట కోతకు గురైంది. దీంతో మరువ నీరు పంట పొలాలపై ప్రవహించాయి. చీనీ చెట్లు, వరి పొలాలపై నీరు ప్రవహించడంతో వరి పొలాలు నీట మునిగాయి. వంద ఎకరాలకు పైగా నష్టం వాటిల్లింది.

- బండమీదపల్లి గ్రామంలో సల్లాపురమ్మ ఆలయ పూజారి నారాయణప్పకు చెందిన 80 మేకలు నీటిలో మునిగి మృతి చెందాయి. కొన్ని మేకలు గల్లంతయ్యాయి.



రాప్తాడు మండలంలో వాన నీటితో నిండిపోయిన చీనీ తోట



బండమీదపల్లిలో మృతి చెందిన మేకలు

రికార్డుస్థాయిలో వర్షం



తెగిన కనగానపల్లి చెరువుకట్ట



కుర్లపల్లిలో వరదనీటికి కొట్టుకుపోయిన వేరుశనగ

కనగానపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో 19 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. మండలంలోని ముత్తవకుంట్ల, ముక్తాపురం, తగరకుంట, తల్లిమడుగుల తదితర చెరువులన్నీ మరువ పారాయి. కనగానపల్లి చెరువు కట్ట పూర్తిగా తెగిపోవడంతో నీరంతా పంట పొలాల మీదుగా ప్రవహించింది. మండల వ్యాప్తంగా 200 ఎకరాల్లో వరి, 200 ఎకరాలలో వేరుశనగ, వంద ఎకరాల్లో టమోట, 300 ఎకరాల్లో ఇతర పంటలు భారీగా దెబ్బతిన్నాయి. తగరకుంటలో 5 ఇళ్లు, కనగానపల్లిలో 18 ఇళ్లు దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు. మామిళ్లపల్లి తలిపిరి వద్ద అచ్చంపల్లికి చెందిన టమోటా లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వరదలో కొట్టుకుపోయింది. అందులో ఉన్న దాదాపు 250 టమోటా బాక్స్‌లు నీటమునిగాయి. కనగానపల్లిలో చెరువుతెగిపోయిందన్న సమాచారంతో ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ రమాదేవి ఇతర అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే చెరువుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు.

స్తంభించిన రాకపోకలు

కాగా ముక్తాపురం చెరువు మరువ పారి జాతీయ రహదారిపైకి నీరు రావడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మామిళ్లపల్లి పెద్దవంక పారడం, కనగానపల్లి పండమేరు వంక పొంగిపొర్లడంతో కనగానపల్లి, ధర్మవరం మధ్య ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

వైసీపీ వల్లే ఈ దుస్థితి: పరిటాల సునీత

కనగానపల్లి చెరువు తెగిందన్న సమాచారంతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అక్కడకు చేరుకున్నారు. అక్కడ తెగిన కట్టను, పంట నష్టాన్ని పరిశీలించారు. వెంటనే ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడుకు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువుల మరమతులు, కాలువ పనులు చేపట్టకపోవడంతోనే ఇప్పుడు ఇంతటి నష్టం జరిగిందని విమర్శించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

మరువ పారిన చెరువులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. వరి, టమోట, వేరుశనగ, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. హరియన్ చెరువులో 60 ఎకరాలకు పైగా వరి నీట మునిగింది. ముష్టికోవెల, న్యామద్దల, హరియన్‌చెరువు చెరువులు మరువ పారడంతో ఈ పరిస్థితి సంభవించిందని రైతులు పేర్కొన్నారు. చిత్రావతి, వంగపేరు నది ఉధృతి కారణంగా ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారిపై మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. సీకేపల్లి, నామాల, న్యామద్దల, హరియన్‌చెరువు తదితర గ్రామాలలో వంకలు భారీగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



చిన్నమొగలాయపల్లిలో నీటమునిగిన టమోటా

పంటలకు అపార నష్టం



కొట్టుకుపోయిన పోలేపల్లి-అక్కంపల్లి రోడ్డు

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి 98.5మి.మీ వర్షపాతం కురిసింది. ఈ వర్షానికి పోలేపల్లి, అక్కంపల్లి, కుంటిమద్ది, శ్రీహరిపురం, సుద్దకుంటపల్లి తదితర గ్రామాలలో వరి, వేరుశనగ, టమోట, ఆముదం పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆయా గ్రామాలకు వెళ్లి నష్టపోయిన వారికి ధైర్యం చెప్పారు. కుంటిమద్ది చెరువు నుంచి భారీగా వరద ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 60 ఎకరాలలో పంట నీట మునిగినట్టు అధికారులు తెలిపారు. అక్కంపల్లి, పోలేపల్లి గ్రామాలకు చెందిన నారాయణ, జనార్దన్ నాయుడు, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తికి చెందిన దాదాపు 250 బస్తాలు వేరుశనగకాయలు వర్షానికి కొట్టుకుపోయాయి.



నీటిపాలైన వేరుశనగ

మరో మూడు రోజులు వానలు


బుక్కరాయసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయం, ఉద్యాన పంటలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటలను ఆశించిన చీడ పురుగుల నివారణకు పురుగుమందులు పిచికారీ చేయడాన్ని మూడు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు సూచించారు. ఉద్యాన, వ్యవసాయ పంటలకు సంబంధించి తక్షణమే వ్యవసాయ సలహాలు పాటించాలని సూచించారు. అధిక వర్షాలు వలన ముంపునకు గురి అయిన తోటల్లో మురుగు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. కోత కోసిన పంటను భద్ర పరుచుకోవాలని సూచించారు. అరటి, టమాటా పంటలు గాలి, వానకు పడిపోకుండా ఊతం ఇవ్వాలన్నారు. కూరగాయల పంటలకు వర్షాలు నిలిచిన అనంతరం ఫార్ములా- 4 లేదా పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పూత దశలో ఉన్న కందిలో మచ్చల పురుగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం శనగ సాగు చేసే రైతులు అక్టోబరు రెండో పక్షం నుంచి నవంబరు మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చని సూచించారు.

హంద్రీనీవా కాలువకు గండి



హంద్రీనీవా కాలువకు పడిన గండి

సోమందేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచేపల్లి సమీపాన మంగళవారం హంద్రీనీవా కాలువకు గండిపడింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లడంతో హంద్రీనీవా కాలువలోకి పెద్దఎత్తున నీరు చేరింది. మంచేపల్లివద్ద కాలువకు గండిపడింది. నీరు మంచేపల్లి, పందిపర్తి చెరువులకు చేరుతోంది. గ్రామస్థులు.. అధికారులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే రెండు చెరువులు నిండి మరువలు పారడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మంచేపల్లి చెరువు మరువ నీరు ఈదులబళ్లాపురం చెరువుకు చేరుతున్నాయి. సమాచారం అందుకున్న అధికారులు ఆగమేఘాలపై ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువ గండిని పూడ్చే క్రమంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై సమీక్షించారు. గ్రామంలోకి నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు.

సీబీఆర్‌కు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నేడు గేట్లు ఎత్తే అవకాశం

తాడిమర్రి మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం ఉదయానికి ఇన్‌ఫ్లో 5వేలు ఉండగా.. సాయంత్రానికి అది 10వేలకు పెరిగినట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం మొత్తం 9.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.7 టీఎంసీల నిల్వఉంది. ఇన్‌ఫ్లో బుధవారం వరకు కొనసాగితే 10 గంటలకు రెండు గేట్లు ఎత్తి, నీటిని నదికి వదులుతామని అధికారులు తెలిపారు. దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి, యల్లనూరు మండలం లక్షుంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నదిలోకి ఎవరూ దిగరాదని ఈఈ సూచించారు.

మర్తాడులో వర్షానికి నేలవాలిన వరిపంట



122 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

గార్లదిన్నె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి 30 మి.మీటర్ల వర్షం కురిసింది. దీంతో వరి, పత్తి, వేరుశనగ తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. మొత్తం 47 మంది రైతులకు చెందిన 159 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అధికంగా వరి పంట దెబ్బతింది. 122 ఎకరాలలో వరి, 11 ఎకరాలలో వేరుశనగ, 22 ఎకరాలలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఉదయం వ్యవసాయ అధికారి సోమశేఖర్, సిబ్బంది పంటలను పరిశీలించారు.

సంక్షిప్తం

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.33, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన తెలిపారు.

రిజర్వాయర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మంగళవారం 1295 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎస్ఎస్ఎస్ ఫేజ్-2కు 1165 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటినిల్వ ఉందన్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్‌లో నవంబరు 14నుంచి, జర్దోసి మగ్గం వర్క్‌లో 15నుంచి, టైలరింగ్‌లో 18వతేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగిన 19-45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం, అనంతరం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 8309915577, 9618876060, 9440905479ను సంప్రదించాలని ఆమె కోరారు.

'దరఖాస్తు చేసుకోండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నవంబరు 24న నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఆయన మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 480 మార్కులు, ప్రైవేట్ పాఠశాలలో 520 సాధించి ఉండాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన వారు 850, ప్రైవేట్ కళాశాలలో 900 మార్కులు సాధించిన జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులు అర్హులన్నారు. నవంబరు 15లోగా దరఖాస్తులను 'శ్రీనివాసులు, డోర్ నంబరు 18-1-406, వేణుగోపాల్‌నగర్, పాతూరు, అనంతపురం' చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9440501463, 9441222874కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు శివప్రసాద్ పాల్గొన్నారు.

డ్రస్‌మేకింగ్ కోర్సుకు అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలికల ఐటీఐలో డ్రస్‌మేకింగ్ కోర్సుకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఐటీఐల జిల్లా కోఆర్డినేటర్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఫెయిల్/పాస్ అయిన బాలికలు అర్హులన్నారు. ఈనెల 26 లోగా ఏపీ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న బాలికలు ఈ నెల 28న వారి సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నేడు ఇన్‌చార్జ్ సీసీఎఫ్ సెల్వం రాక

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్కిల్ ఇన్‌చార్జ్ సీసీఎఫ్ సెల్వం బుధవారం రానున్నారు. ప్రస్తుతం ఉన్న సీసీఎఫ్ యశోదాబాయి బాధ్యతలు చేపట్టిన వెంటనే శిక్షణ నిమిత్తం వెళ్లారు. దీంతో తిరుపతి సర్కిల్ సీ సీఎఫ్ సెల్వం కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన బుధవారం రానున్నారు. ఆయన గురువారం ఎన్ఆర్‌జీ ఎస్ స్కీమ్ అమలుపై అనంతపురం సర్కిల్ సిబ్బందితో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి చర్చించనున్నారు.

రెండు రైళ్ల రద్దు

గుంతకల్లు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): దానా తుపాను కారణంగా అనంతపురం మీదుగా వేళ్లే బెంగళూరు-హౌరా-బెంగళూరు అప్ అండ్ డౌన్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-భువనేశ్వర్ (రైలు నం. 18464)ను ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 18463)ను 24న రద్దు పరచినట్లు తెలియజేశారు.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక రద్దు

జిల్లాలోని రాయదుర్గం-కదిరిదేవరపల్లి రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న యార్డు ఆధునికీకరణ పనుల కారణంగా తిరుపతి ప్యాసింజరును పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 07589) రైలును నవంబరు 1 నుంచి 30 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07590)ను నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో పాక్షికంగా రద్దు పరచి, గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు. అలాగే రైల్వే మెయింటెనెన్స్ వర్కుల కారణంగా గుత్తి మీదుగా వెళ్లే కాచిగూడ-తిరుపతి (నం. 07063) ప్రత్యేక రైలును ఈ నెల 29, నవంబరు 5, 12 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07064)ను ఈ నెల 30న, నవంబరు 6, 13 తేదీల్లోనూ రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఊరిబడికి ప్రాణం..!

జీఓ 117 రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం

సర్వత్రా హర్షం

కదిరి మండలంలోని పట్నం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 170 మంది విద్యార్థులు గతంలో చదువుకునేవారు. గత వైసీపీ పాలనలో పాఠశాలల విలీనం తరువాత 1, 2 తరగతులకు చెందిన 19 మంది మాత్రమే మిగిలారు. వీరికి ఒక ఉపాధ్యాయుడున్నారు. పాఠశాలలో 16 గదులు ఉండగా, కొన్ని వృథాగా మారాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓతో ఈదుస్థితి ఏర్పడింది.


వృథాగా ఉన్న తరగతి గదులు



పట్నం ప్రాథమిక పాఠశాల

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 117ను వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేయాలని నిర్ణయించింది. పాఠశాలలో తరగతుల విలీనం, ఉపాధ్యాయుల సర్దుబాటు, ప్రాథమిక స్థాయిలో 20 మందికి ఒక ఉపాధ్యాయుడు లాంటి వాటిని అమలు చేస్తూ ఈ జీఓను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దాని అమలులో భాగంగా మార్పులు చేపట్టింది. పాఠశాలలను విలీనం చేయడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైంది. ప్రస్తుతం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వివాదాస్పద జీఓ రద్దుకు నిర్ణయించింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వేలల్లో తగ్గిన విద్యార్థులు

విలీన ప్రక్రియతో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు మందగించడం చాలాచోట్ల 1, 2 తరగతులు మాత్రమే నిలిచాయి. 3, 4, 5 తరగతులు విలీనమైనచోట్ల సరిపడా గదులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దూరంగా ఉండే పాఠశాలలకు పంపించడం ఇష్టంలేని తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. విలీన ప్రక్రియతో విద్యావ్యవస్థ నాశనం కావడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. అయినా గత వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఎక్కువగా జీఓ 117కు సంబంధించిన వినతులే అందాయి. ఈనేపథ్యంలో ప్రాథమిక విద్యను దెబ్బతీసే జీఓ 117ను రద్దు చేస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గాడితప్పిన వ్యవస్థను సరైన మార్గంలోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు జీవం

ప్రభుత్వ బడులకు ప్రతిబంధకంగా ఉన్న జీఓ 117ను రద్దు చేయడంద్వారా కూటమి ప్రభుత్వం పాఠశాలకు జీవం పోసింది. విలీన సమస్యలు నాలుగేళ్లగా ఉపాధ్యాయులను వెంటాడుతున్నాయి. జీఓ రద్దుతో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతమవుతుంది. హామీ అమలు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- చింతా నాగరాజు, ఉపాధ్యాయుడు, కదిరి



విలీనంతో గందరగోళం

ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసేందుకు అమలు చేసిన 117 జీఓతో గందరగోళం ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య త గ్గింది. జీఓను రద్దు చేస్తే బడులకు పూర్వవైభవం వస్తుంది.

- క్రిష్ణమోహన్, ఉపాధ్యాయుడు, కదిరి

నిరీక్షణకు తెర

పీఆర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం అండ

58 మందికి జీతాల భద్రత

పీఆర్ నుంచి డ్వామాకు బదలాయింపు

18 నెలల వేతన బకాయిలు మంజూరు


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిరీక్షణ ఫలించింది. వేతన బకాయిలు విడుదలయ్యాయి. దీంతో పంచాయతీ రాజ్ శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. గత 16 ఏళ్ల నుంచి నెల నెలా సక్రమంగా జీతాలు రాక, ఇబ్బంది పడిన వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. జీతాల సమస్య పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీసుకెళ్లారు. వెంటనే డిప్యూటీ సీఎం స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఫలితంగా పీఆర్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ గ్రామీణాభివృద్ధి శాఖలోని డ్వామాలోకి బదలాయించారు. దీంతో పాటు అక్కడి నుంచే ప్రతి నెలా జీతాలు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక 18 నెలల వేతన బకాయిలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.25 కోట్లను మంజూరు చేశారు. దీంతో ఇకమీదట ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు వస్తాయని ఆ చిరుద్యోగులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ధ్రువపత్రాల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఏమాత్రం ఆలస్యంగా కాకుండా డ్వామా, పీఆర్ అధికారులు కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 02 ఆఫీస్ సబార్డినేట్‌లు, 34మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు మొత్తంగా 58 మందికి సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. అనంతపురం జిల్లాలో 42మంది ఉద్యోగులకు స్థానిక డ్వామా స మావేశ మందిరంలో ధ్రువపత్రాల పరిశీలన చేశారు. డ్వామా హెచ్ఆర్ మేనేజర్ గీత, సూపరింటెండెంట్‌లు శశికళ, శైలజ, పీఆర్ డీఈఈ గురుమూర్తిరాజు, డీఏఓ లక్ష్మీదేవి తదితర అధికారులు ధ్రువపత్రాలను పరిశీలించారు. డ్వామా పరిధిలోని ఎన్ఐసీ పోర్టల్ ద్వారా సమగ్ర వివరాలను అప్‌లోడ్ చేసి అప్కాస్ కిందికి వీరందర్ని తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు ఒక్కొక్కర్ని కేటాయించారు. మొత్తంగా పీఆర్ నుంచి డ్వామాకు బదలాయించడంతో జీతాలకు భద్రత కలిగింది.



చుక్కలు చూపిన వైసీపీ సర్కార్

2009 నుంచి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 598మంది ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నాం. మొదట్లో మాకు జీతాలు బాగానే ఇచ్చేవారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా మాకు కష్టాలే. గత వైసీపీ సర్కార్ ఐదేళ్ల పాలనలో మాకు చుక్కలు చూపించారు. ఉద్యోగ భద్రత పక్కన పెడితే కనీసం జీతాలను కూడా ఇవ్వలేదు. గత సీఎంతో పాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినా ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ఆర్టీలు అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి మా సమస్యను విన్నవించాం. వెంటనే పరిష్కారించి మాకు అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది.

- నరేష్‌బాబు (డేటాఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు)



డిప్యూటీ సీఎంకి రుణపడి ఉంటాం

మా సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి తిరిగినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వాలు మారినా మాకు న్యాయం జరగలేదు. కూటమి అధికారంలోకి రాగానే.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నెలల వ్యవధిలోని మా సమస్యను పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు రుణపడి ఉంటాం.

- కిరణ్ (టెక్నికల్ అసిస్టెంట్, జోనల్ సెక్రటరీ)



ఉద్యోగులకు అండగా నిలిచినట్లే

పంచాయతీ రాజ్‌శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. ఉద్యోగ భద్రతతో పాటు 18 నెలల వేతన బకాయిలు మంజూరు చేయడం చూస్తే.. వారందరికి ప్రభుత్వం అండగా నిలిచినట్లుగా అనిపిస్తోంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, ఉమ్మడి జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖ.

హామీని నెలబెట్టుకోండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో పదివేల క్యూసెక్కుల నీరు పారిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని మంత్రి కేశవ్, ఇరిగేషన్ అధికారులకు సూచించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డిస్ట్రిబ్యూటరీలతో పాటు ప్రధాన కాలువపైన దృష్టి సారించాలని కోరారు. కాలువలో పదివేల క్యూసెక్కుల నీరు పారించగలిగితే 3.5లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి జిల్లాను సస్యశామలం చేయవచ్చునన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2021లో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, 6300క్యూసెక్కుల నీటిని తీసుకువస్తామని జీవో ఇచ్చినా ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ చేయకపోవడం వల్ల డ్యాంలో నీళ్లు ఉన్నప్పటికీ కూడా అదనంగా నీరు తీసుకోలేకపోతున్నామన్నారు. వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు, కుంటలు తెగిపోయాయని, వాటి మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, శీనప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘర్షణ.. అనంతరం మృతి


మల్లికార్జున (ఫైల్)

బుక్కరాయసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగదు లావాదేవీ విషయంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన అనంతరం మల్లికార్జున(45) మృతి చెందాడు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు... కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జునకు గోవిందపల్లి గ్రామ పంచాయతీలోని బీజేపీ కాలనీకి చెందిన రఫీ రూ.40వేలు అప్పు ఇచ్చాడు. ఈ డబ్బు విషయంగా ఇద్దరి మధ్య మంగళవారం వాగ్వాదం జరిగింది. దీనిపై పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. పంచాయితీ జరుగుతుండగానే మల్లికార్జున, రఫీ కొట్టుకున్నారు. వారి గొడవను పెద్ద మనుషులు ఆపారు. అనంతరం మల్లికార్జున కుప్పకూలిపోయాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. గొడవలో రఫీ కొట్టిన దెబ్బలకు మృతి చెందడా? లేదా అనారోగ్యం రీత్య మృతి చెందడా? అన్న విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరణాకర్ అనంతపురం సర్వజన ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పెద్దమనుషుల పంచాయితీ, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

శివరాంపేట సమీపంలో..


మృతి చెందిన అశోక్, వినోద్

కూడేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన అశోక్ (21), నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం, మహిమలురూ గ్రామానికి చెందిన వినోద్ (27) మృతి చెందిన వారిలో ఉన్నారు. కూడేరుకు చెందిన దామోదర్ తీవ్రంగా గాయపడ్డారు. దామోదర్, వినోద్ ఇద్దరు మండల సమీపంలోని సుజలాన్ కంపెనీలో పనిచేస్తున్నారు. అశోక్ అనంతపురంలో వుడ్ వర్క్ చేసేవాడు. ప్రతి రోజు దామోదర్, వినోద్‌లిద్దరు కంపెనీలో పని ముగించుకొని కూడేరుకు వచ్చేవారు. అశోక్ కూడా అనంతపురంలో పని ముగించుకొని కూడేరు మీదుగానే స్వగ్రామానికి వెళ్లేవాడు. ఈక్రమంలో ముగ్గురు మంచి స్నేహితులయ్యారు. సోమవారం ద్విచక్ర వాహనంపై ముగ్గురూ కూడేరు నుంచి ఉరవకొండకు బయల్దేరారు. శివరాంపేట గ్రామం దాటిన తర్వాత మలుపువద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి, కింద పడ్డారు. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అశోక్, వినోద్ మృతి చెందారు. దామోదర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాలను పోస్టుమార్టంకు తరలించారు.

ఎంత ఘోరం చేశావు దేవుడా...

నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన వినోద్ కూడేరులో అద్దె గదిలో ఉంటూ సమీపంలో సుజలాన్ కంపెనీలో పని చేసేవాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి తల్లి పావని గుండెలవిసేలా మృతదేహంపై పడి రోదించింది. ఎంత ఘోరం చేశావు దేవుడా..! కుటుంబ జీవనానికి ఆధారంగా ఉంటున్న బిడ్డను మాకు దూరం చేశావా? ఇప్పటికే భర్తను తీసుకెళ్లావు. ఇప్పుడు కొడుకుని కూడా దూరం చేశావు ఇంక మాకు దిక్కెవరు అంటూ కన్నీరు మున్నీరు అయ్యింది. ఆమెను ఓదార్చడం బంధువులకు సాధ్యం కాలేదు.

ఢిల్లీలో అవార్డు అందుకున్నారు


అవార్డు అందుకుంటున్న వాటర్‌షెడ్స్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, హంపాపురం సర్పంచు లక్ష్మీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జలసంరక్షణలో ఉత్తమ ఫలితాలు సాధించిన హంపాపురం గ్రామ పంచాయతీ వాటర్‌షెడ్ జాతీయ స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కేంద్రజలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా డ్వామా వాటర్ షెడ్స్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, హంపాపురం గ్రామ పంచాయతీ సర్పంచు లక్ష్మీదేవి అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల డ్వామా, వాటర్‌షెడ్స్ ఉద్యోగులు, హంపాపురం గ్రామ పంచాయతీ ప్రజలు అభినందనలు తెలిపారు.

ఊరికి దారేది..!

నేటికీ రోడ్డులేని చాపర్లపల్లి బీసీ కాలనీ

మురుగు కాలువపై నుంచి వెళ్లాల్సిందే..


రోడ్డులేక డ్రైనేజీ గుండా వెళ్తున్న కాలనీ వాసులు

మడకశిర రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలోనూ ఓ ఊరికి దారి లేదంటే నమ్మగలమా. అయినా వాస్తవం. మండలంలోని చాపర్లపల్లి బీసీ కాలనీకి రోడ్డులేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 90 ఇళ్లు, 290 మంది జనాభా ఉంటోంది. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లడానికి దారిలేదు. డ్రైనేజీ నుంచే వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రిపూట ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే వారు పడే బాధలు అన్నీఇన్నీ కావు. మారుమూల గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవనడానికి చాపర్లపల్లి బీసీ కాలనీయే నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు



శ్రీనివాసులురెడ్డి, చాపర్లపల్లి గ్రామం

గత ఐదేళ్లలో కాలనీకి రోడ్డు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు వేయించాలి.

రాత్రిపూట బయటకు రావాలంటే భయం



నరసింహారెడ్డి, చాపర్లపల్లి

గ్రామ జనాభాలో సగానికిపైగా బీసీ కాలనీలో ఉంటున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి డ్రైనేజీలోనే వస్తున్నాం. రాత్రిపూట బయటకు రావాలంటేనే భయంగా ఉంది. డ్రైనేజీలో పాములు, విషపురుగులు ఉండడంతో సాయంత్రం ఐదు గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నాం. దారి లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

కాలనీ అభివృద్ధికి చర్యలు చేపడతాం

సోనియాబాయి, ఎంపీడీఓ, మడకశిర

చాపర్లపల్లి బీసీ కాలనీకి రోడ్డు విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతాం.


కొట్టుకుపోగా మిగిలిన వరి పంటను చూసి, ఆవేదన చెందుతున్న రైతు తరిగోపుల బాబు

కన్నీళ్లే మిగిలాయి...

కళకళలాడిన పైరు..
కనిపించకుండా పోయింది..
పరుచుకున్న పసిరిక
పత్తాలేకుండా పోయింది..
కష్టం నీళ్లపాలైంది..
కన్నీళ్లు మిగిల్చింది..
ఆశల పంట..
ఒక్కరాత్రిలో కొట్టుకుపోయింది..
బంగారు పంటలు పండే పొలం..
బండరాళ్లతో నిండిపోయింది..
అన్నదాత గుండె పగిలిపోయింది..


తరిగోపుల బాబు, రైతు

ఈయన పేరు తరిగోపుల బాబు. కనగానపల్లికి చెందిన రైతు. రాళ్ల మధ్యలో తన ఆశలను, కష్టాన్ని వెతుకుంటున్నాడు. వ్యయప్రయాలకోర్చి సాగుచేసిన పైరును బండరాళ్ల కింద శోధిస్తున్నాడు. తరిగోపుల బాబు కనగానపల్లి చెరువు కట్ట కింద నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. పంట వెన్నుదశలో ఉండేది. నెలరోజులు ఆగితే చేతికొచ్చేది. భారీ వర్షం అతడి ఆశలను అడియాసలు చేసింది. వాన బీభత్సానికి కనగానపల్లి చెరువు కట్ట సోమవారం రాత్రి తెగిపోయింది. బాబు సాగుచేసిన పంట మొత్తం కొట్టుకుపోయింది. అతడి భూమిలో చెరువు కట్టకు వాడిన భారీ రాళ్లు వచ్చి పడ్డాయి. పంట పెట్టుబడి పాయె.. పొలమూ పాయె అంటూ రైతు రోదిస్తున్నాడు. భూమిని మళ్లీ సాగులోకి తెచ్చుకోవడం అంత సులువు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

క్లుప్తంగా ...

భూములు రీసర్వేపై 12 ఫిర్యాదులు

తనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండువారి పల్లి గ్రామంలో మంగళవారం అధికారులు భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మొత్తం 12 మంది భూ రీసర్వేలో సమస్యలపై ఫిర్యాదు చేశారని తహసీల్దార్ శోభాసువర్ణమ్మ తెలిపారు.

సీజీపీ ద్వారా నీటి విడుదల

తనకల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారి పల్లి సమీపంలో పాపాగ్ని నదిపై నిర్మించిన చెన్నస్వామిగుడి ప్రాజెక్టు నుంచి మంగళవారం ఒక గేటు ద్వారా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ బయప్ప తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఈ ప్రాజెక్టు నిండటంతో మూడు రోజులుగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కాగా ప్రాజెక్టును, కట్టను, గేట్లను డీఈ గంగాద్రి, ఏఈ పరిశీలించారు.

విద్యార్థులకు అవగాహన

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు మంగళవారం నిర్వహించారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని సీఐ నాగేంద్రప్రసాద్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో భౌగోళిక మ్యాప్, వైర్లెస్ సెట్, కేసు డైరీ.. తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపీకుమార్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భానుమూర్తి మంగళవారం పరిశీలించారు. క్రీడల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించిన బాలికలను ఆయన అభినందించారు. క్రీడలపట్ల బాలికలు మొగ్గుచూపడానికి కృషి చేస్తున్న పీడీ , పీఈటీలను అభినందించారు. సమగ్ర శిక్ష తరఫున రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, టెబుల్ టెన్నీస్‌కు సామగ్రి పాఠశాలకు అందడానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం, పీడీ శంకర్‌నాయక్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గాండ్లపెంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పౌరసరఫరా కేంద్రంలోని హమాలీ రామాంజులు (40) అనారోగ్యంతో మరణించాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను తిరుపతిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. అతని స్వగ్రామమైన సోమయాజులపల్లికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న స్టాకిస్టు వెంకటేష్ అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేలను రామాంజులు భార్య అరుణకు అందించారు. రామాంజులుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఇండిగ్యాప్ ధ్రువీకరణతో అధిక మార్కెట్

నంబులపూలకుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇండిగ్యాప్ ధ్రువీకరణ ద్వారా రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, పంటలను మార్కెట్లో అధిక ధరలకు విక్రయించి లాభం పొందవచ్చని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెలిచెలమలలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఆయన ఎక్స్‌ట్రాన్స్ డాక్టర్ రవితో కలిసి పంటలను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ... ఈ ధ్రువీకరణ దేశీయ, అంతర్జాతీయ మార్కెటింగ్‌లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, టెక్నికల్ అడ్వజర్ లక్ష్మీప్రియ, వ్యవసాయ అనుబంధశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు



జగనన్న లే ఔట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సువర్ణ

కొత్తచెరువు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలను ఎవరైన ఆక్రమించాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ సువర్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ధర్మవరం రహదారిలోని జగనన్న లేఔట్‌ను ఆమె పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అప్పట్లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎన్నికల సమయంలో గుట్టుచప్పుడుగా ఇళ్లపట్టాలను అందించారు. దీనిపై అదే పార్టీకి చెందిన కొందరు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి నుండి ఆ ఇళ్లపట్టాల సమస్య కొనసాగుతోంది. ఈ ఇళ్లపట్టాలు పొందిన 22 మంది పునాదులు వేయడానికి వెళ్లితే కొందరు అడ్డుకుంటున్నారు. దీనిపై వారు ఆర్డీఓ సువర్ణకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ ఆ స్థలాలలను పరిశీలించారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలుతీసుకుంటామన్నారు.

ఉపాధిలో రూ. 20 లక్షల అవినీతి

కొత్తచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు దాదాపు రూ. 20 లక్షల అవినీతికి పాల్పడినట్లు అధికారులు నిగ్గతేల్చారు. వారం రోజుల పాటు 15 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం సామాజిక తనిఖీపై గ్రామసభను నిర్వహించారు. ఉపాధి హామీ పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ.. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 3,90,68,000 ఉపాధి పథకం కింద పనులు చేపట్టగా.. అందులో రూ. 19,99,450 అవినీతి జరిగిందన్నారు. లోచర్ల పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ రూ.15 వేలు అవినీతికి పాల్పడటంతో అతన్ని సస్పెండ్ చేసి రికవరికి ఆదేశించామన్నారు. ఎక్కువ భాగం హౌసింగ్, హార్టికల్చర్ మస్టరలో అవినీతి జరిగిందని, 15 రోజుల్లో అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు రైతులతో మొక్కలు నాటించకపోతే వారి నుంచి ఈ డబ్బులను రికవరీ చేస్తామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోటకు చెందిన యువకుడు బాబాఫక్రుద్దీన్ అప్పుల బాధ తాళలేక మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. బైక్ మెకానిక్ అయిన అతను అధికంగా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెందాడు. శ్మశాన వాటిక వద్ద అధిక మోతాదులో మాత్రలు మింగి.. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడికి పాముకాటు

ధర్మవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన వృద్ధుడు ఓ సూరప్ప పాముకాటుకు గురయ్యాడు. అతను తన ఇంటి నుంచి పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా... మార్గ మధ్యలో ఓ పాము కాటేసింది. గమనించిన స్థానికులు అతన్ని వెంటనే ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.



ఓడీసీ: మరువ పారుతున్న చౌడేపల్లి చెరువు



ఎన్పీకుంట: నల్లగుట్టపల్లి తండాకు వెళ్లే బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు



బత్తలపల్లి: పోట్లమర్రి వద్ద దూప్‌లేట్ వంక ఉధృతి

బీభత్సం

జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. వరి, వేరుశనగ.. తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పలు చెరువులు నిండాయి. వాగు.. వంకలు పొంగిపొర్లాయి. వారం రోజులుగా ఎడతెరపి లేని వానతో వేరుశనగ పంట కుళ్లిపోయింది. కాయలు నల్లబారాయి. అధికారులు పొలాల్లో పర్యటిస్తూ నష్టాన్ని అంచనా వేస్తున్నారు.



ఎన్పీకుంట: పెడబల్లి జలాశయం నుంచి ఉప్పొంగుతున్న నీరు

- వణికించిన గాలివాన
- నేలకొరిగిన పంటలు
- పొంగిపొర్లిన వాగులు.. వంకలు
- స్తంభించిన రాకపోకలు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చిత్రావతి, వంగపేరు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో పలుప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాకేంద్రంలోని చిత్రావతి నది పరవళ్లు తొక్కింది. జిల్లాకేంద్రంలోని చెక్‌డ్యాంపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించింది.

● ధర్మవరం : ధర్మవరం చెరువు నిండి పరవళ్లు తొక్కింది. మోటుమర్ల, గొట్లూరు, బత్తలపల్లి మండలం పోట్లమర్రి బ్రిడ్జిలపై వరద నీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కేతిరెడ్డికాలనీకి వెళ్లే అండర్ బ్రిడ్జి కింద భారీ ఎత్తున వర్షపు నీరు చేరింది. నడిమిగడ్డపల్లి తండాలో రైతు అప్పానాయక్ ద్రాక్షపంట దెబ్బతింది. రూ. దాదాపు రూ.20 లక్షల దాకా నష్టం వాటిల్లింది.

● బుక్కపట్నం : చెరువు కింద సాగుచేసిన వరి పంట దెబ్బతింది. వంద ఎకరాల్లో వరి పంట నష్టం జరిగింది. ఏఓ సతీష్‌బాబు సిబ్బందితో కలిసి పంట నష్టాన్ని అంచనావేశారు.

● ఓబుళదేవరచెరువు : మండలంలో చౌడేపల్లి, గౌరాపురం చెరువులు నిండాయి. సోమావతి నదికి గ్రామీణులు గంగపూజ చేశారు. సోమావతి నది ప్రవాహానికి సున్నంపల్లి వంతెన తెగింది. దీంతో మంగళవారం ఉదయం నుంచి రాకపోకలు స్తంభించాయి. తెగిన ప్రాంతాన్ని రాళ్లు, మట్టితో పూడ్చివేసి వంతెనకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

● తనకల్లు : మరాలపల్లి వద్ద వందమానేరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆటోలు, ద్విచక్ర వాహనదారులు వెళ్లకుండా పోలీసులు కాపాలా ఉన్నారు. మండ్లిపల్లిలో వరి పంట దెబ్బతింది.

● బత్తలపల్లి : పోట్లమర్రి వద్ద దూప్‌లేట్ వంక రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘమేశ్వరం వద్ద, రామాపురం బ్రిడ్జి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్రాచెరువు నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

● నంబులపూలకుంట : పెడబల్లి జలాశయం నిండి పొంగి పొర్లుతోంది. వారం నుంచి కురుస్తున్న వర్షాలకు ఎగువనున్న తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టు నిండి, గెట్లు ఎత్తడంతో ఆ నీరంతా పెడబల్లి జలాశయానికి చేరింది. దీంతో మంగళవారం ఈ జలాశయం నిండింది.

● తాడిమర్రి : మండలంలో సోమవారం రాత్రి 56 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిడిగల్లు, నారసింపల్లి, ఆత్మకూరు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వేరుశెనగ పంట భూమిలోనే మొలకలు ఎత్తుతున్నాయి. ఆ వేరుశనగ కట్టె పశువుల మేతగా కూడా పనికి రాకుండా పోయింది. కాయలు కూడా నల్లగా మారిపోతున్నాయి.

● కొత్తచెరువు : వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారి నటరాజ్ తెలిపారు. మండలంలో 110 ఎకరాలలో వరి, 10 ఎకరాలలో మొక్కజొన్న దెబ్బతిన్నాయ న్నారు. మండలంలో 88.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. వంగపేరు నది బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి.



నడిమిగడ్డపల్లి తండాలో ద్రాక్షపంటను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ఆదుకుంటాం

ధర్మవరం : వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేలా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించారు. జరిగిన నష్టాన్ని బాధితులను అడిగితెలుసుకు న్నారు. నడిమిగడ్డపల్లితండాలో రైతు అప్పానాయక్‌కు చెందిన ద్రాక్షతోట దెబ్బతింది. ఆ రైతును పరామర్శించి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. కమిషనర్ సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసి నష్టాన్ని అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

చిలకం పరిశీలన

మండలంలో రేగాటిపల్లి చెరువునిండింది. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆ చెరువును మంగళవారం సాయంత్రం పరిశీలించారు. చెరువు కట్ట తెగితే గ్రామానికి ప్రమాదం వస్తుందని గుర్తించి.. చెరువు నీటిని పక్కకు మళ్లించేలా మరమత్తులు చేయించాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు.



రేగాటిపల్లి చెరువును పరిశీలిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి



ధర్మవరం: కేతిరెడ్డి కాలనీలో చేరిన వర్షపు నీరు



బుక్కపట్నం చెరువు కింద, తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద, కొత్తచెరువు మండలం పాతదేవరపల్లి వద్ద దెబ్బతిన్న వరి పంట

సీసీ రోడ్డు వేశాం.. అంతే ..!

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దకమ్మవారిపల్లెకు పోవాలంటే ఈ నీటిమడుగును దాటాల్సిందే. నగరపంచాయతీ పరిధిలోని 20వ వార్డు పెద్దకమ్మవారిపల్లికి వెళ్లేందుకు ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సీసీ రోడ్డు వేశారు. అయితే ఎలాంటి ముందుచూపు లేకుండా.. కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకుండా తక్కువ ఎత్తులో సిమెంట్ రోడ్డును వేసి.. చేతులు దులిపేసుకున్నాడు. రోడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షం వచ్చినప్పుడల్లా.. నీరు రోడ్డుపై ఇలా నిల్వ ఉంటోంది.



కమ్మవారిపల్లి వద్ద సీసీ రోడ్డుపై నిల్వ ఉన్న నీరు



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రుణాలివ్వాలని బ్యాంక్ ఎదుట ధర్నా

తనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ రుణాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఎదుట పలు ప్రజా సంఘాల నాయకులు, విశ్వకర్మ లబ్ధిదారులు మంగళవారం ధర్నా చేశారు. తలుపులు మూసి వేసి.. బ్యాంక్ ముందు బైటాయించి ఈ ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ... తాము విశ్వకర్మ పథకం కింద శిక్షణ పొంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నామని, బ్యాంక్‌లో సిబ్బంది కొరత పేరుతో మేనేజర్ ఆంజనేయులు నాయక్ రుణాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో రైతు సంఘం వెంకటరమణ, గిరిజన పోరాట సమితి నాయకుడు ప్రసాద్‌నాయక్, దళిత సంఘం పారేసు, కౌలుదారి సంఘం కరీముల్లా, దళిత సంఘాల నాయకులు కొండయ్య, బీసీ సంఘం శ్రీనివాసులు, విశ్వకర్మ లబ్ధిదారులు పాల్గొన్నారు. దీనిపై బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరగా... బ్యాంక్‌లో సిబ్బంది కొరత కారణంగా రుణాలు ఇవ్వడం ఆలస్యం అవుతోందని, అర్హులైనవారందరికి రుణాలు మంజూరు చేస్తామని అన్నారు. రూ. లక్ష రుణం తీసుకునే వ్యక్తి కచ్చితంగా జీఎస్‌టీ బిల్లులు తీసుకురావాలన్నారు.



స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

నంబులపూలకుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపల్లి గ్రామానికి వెళ్లే రహదారి కోతకు ఇటీవల కోతకు గురైంది. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. గ్రామస్థులందరూ స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని వేయించి రోడ్డుకు మరమ్మతులు చేశారు. తమ గ్రామానికి శాశ్వతంగా రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పనులు చేయిస్తున్న గ్రామస్థులు

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉంటూ కొత్తచెరువు మండలం ఎర్రవంకపల్లికి చెందిన హోంగార్డు చెన్నప్ప ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో హోంగార్డుల తమ ఒక రోజు వేతనాన్ని రూ. 4,35,000 ఆ కుటుంబానికి విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును చెన్నప్ప భార్య చంద్రకళకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వీ రత్న మంగళవారం అందజేశారు.



చంద్రకళకు చెక్కును అందచేస్తున్న ఎస్పీ

పల్లె పండుగ సమస్యల పరిష్కారం

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పట్నంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీఓ పోలప్ప పలు సమస్యలను పరిష్కరించారు. వృద్ధురాలు గంగులమ్మకు రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకున్నారు. చెరువు నిండి మరవ పోతే అటువైపు ఉన్న పొలాలకు రైతులు వెళ్లడానికి రహదారి ఏర్పాటు చేయాలని కార్యదర్శి సంజను ఆదేశించారు. అద్దె భవనంలోని బీసీ హాస్టల్‌ను ప్రాథమిక పాఠశాలలోకి మార్చాలని వార్డెన్‌కు సూచించారు.

వైద్యులకు మెమోలు ...

విధులను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ పట్నం ప్రాథమిక ఆస్పత్రిలోని వైద్యులు ప్రమీల, వినోద్‌లపై స్థానికులు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్ పట్నం పీహెచ్‌సీకి వెళ్లి వైద్యులపై విచారించి నివేదికను జిల్లా అధికారులకు పంపారు. మంగళవారం ఆ వైద్యులను జిల్లాకేంద్రానికి పిలిపించి డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాలతో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తెలిపారు.



వృద్ధురాలికి బియ్యం పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ



వైద్యులను విచారిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

సినీహీరో నాగార్జునకు ఘన స్వాగతం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి మంగళవారం జిల్లాకు విచ్చేసిన సినీహీరో నాగార్జునకు శ్రీసత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. శ్రీసత్యసాయి ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో వచ్చిన నాగార్జునను ఏఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో నాగార్జున హోస్ట్‌గా నిర్వహించిన మీలో ఎవరు కోటీశ్వరుడు కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ల... రూ. 12.50 లక్షల ప్రైజ్‌మనీ గెలుసుకున్న విషయం తెలిసిందే.



నాగార్జునతో ఏఎస్పీ శ్రీనివాసులు

ముంచిన వాన


మరవకొత్తపల్లి వద్ద కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా పారుతున్న కుషావతి నది


పెనుకొండ మండలం దుద్దే బండలో వాన నీటిలో మునిగిన మగ్గం




మడకశిర ప్రధాన రహదారిపై దిగబడిన వాహనం


జయమంగళి నది పరవళ్లు


ఎంపీడీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో వరదనీటి మళ్లింపు పనులు

హిందూపురం డివిజన్‌లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో వంకలు వాగులు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా చిలమత్తూరు మండలంలో 32.6 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకలో కూడా భారీ వర్షం కురవడంతో మండలంలోని కుషావతి నదీ ప్రవాహం పెరిగి భారీగా వరద నీరు పెద్దచెరువు, కోడూరు చెరువులకు వచ్చి చేరుతోంది. దీనికితోడుగా చిత్రావతి నది కూడా పొంగులెత్తడతానికి సిద్ధంగా ఉంది. బాగేపల్లి వద్ద ఉన్న పరగోడు చెరువు నిండటానికి మరో అడుగు మాత్రమే మిగిలింది. కర్ణాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు జయమంగళి నది మంగళవారం జోరు పెంచింది. మండలంలోని సరిహద్దు ప్రాంతమైన ముళ్లమోతుకపల్లి గ్రామంలో నదీ ప్రవాహం శ్రీరంగరాజులపల్లి కాజ్‌వే మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు మరువమీదుగా కాలువపల్లి వైపు వెళ్తున్నాయి. నల్లాయనపల్లి వంక పరిగి చెరువుకు చేరడంతో చెరువు నిండే అవకాశం ఎక్కువగా ఉందంటూ ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మడకశిర డివిజన్‌లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో చెరువులకు భారీగా నీరుచేరుతోంది. కుంటలు, చెక్‌డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి. చెరువులకు రెండు,మూడు నెలలకు సరిపడా నీరు చేరింది. సోమవారం నియోజకవర్గంలో 44.2 మీ.మీల వర్షం పడింది.

మల్లాపల్లిలో బాలికల దినోత్సవం


పోటీలో గెలుపొందిన బాలికలను అభినందిస్తున్న సీఐ

గోరంట్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపల్లి ఫంక్షన్ హాల్‌లో ఆర్‌డిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికలదినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ శేఖర్ ఉన్నతపాఠశాల బాలికలకు బాలికల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థినీలు సంస్కృతిక కార్యక్రమలతో అలరించారు. వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన బాలికలు బహుమతులు ప్రదానంచేశారు. ప్రధానోపాధ్యాయులు జయసింహరావు. ఆర్‌డిటి ఎటిఎల్ నరసింగరావు, క్లస్టర్ సీఓలు ఆనంద్‌మూర్తి, పద్మాబాయి, నరేష్, వెంకటేష్, మధు తదితరులున్నారు.

రొద్దంలో వ్యక్తి దారుణహత్య

పెనుకొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం పెద్దిపల్లి పరిధిలోని ఈతవనంలో గుర్తుతెలియని వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రొద్దం ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు పెద్దిపల్లి గ్రామసమీపంలోని ఈతవనంలో గుర్తుతెలియని వ్యక్తి(30-40) మృతిచెందాడని సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ గుర్తు పట్టలేని విధంగా వ్యక్తి కాలిపోయి ఉన్నాడని మృతునికి సుమారు 30నుంచి 40సంవత్సరాలుంటాయన్నారు. మృతుని శరీరంపై పాక్షికంగా కాలిపోయిన తెలుపు, నీలిరంగు నిలువ గీతలున్న షర్ట్ ఉన్నట్లు తెలిపారు. మృతునివద్ద ఏసియన్, బర్జర్ పెయింట్ కాంపౌండ్స్ ఉన్నాయన్నారు.

నేడు చిలమత్తూరు మండల మీట్

చిలమత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 11 గంటలకు జరగనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి మండల పరిషత్ పాలకవర్గంతోపాటు అన్ని శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

భారీ వర్షానికి కూలిన మిద్దె


గుట్టూరులో కూలిపోయిన మిద్దె

పెనుకొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు మండలంలో గుట్టూరుకు చెందిన మహబూబ్‌బాషా ఇల్లు కూలిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మిద్దె దెబ్బతింది. దీంతో ఆ ఇంటివారు అప్రమత్తమై దానికి ఆనుకుని ఉన్న పక్కింటిలో నివాసమున్నారు. అయితే సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉన్న పళంగా మిద్దె పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న సామాగ్రి, టైల్స్ అన్నీ మట్టిలో కలిసిపోయాయి. దీంతో దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నాడు.

ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు

పెనుకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీరాములయ్య కాలనీలో సీపీఐ అనుబంధ సంస్థ ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకుడు మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు టీడీపీ నాయకులు హాజరయ్యారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఫకీర్లు ఆకాక్షించారు. అనంతరం వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ కమిటీ సభ్యులు సీపీఐ కమిటీ సభ్యులు మతపెద్దలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విషతుల్య ఆహారంతో జాగ్రత్త

చిలమత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విషతుల్యమైన ఆహారంతో జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలను కోరారు. మండలంలోని ఆదెప్పల్లిలో ఓ కుటుంబం పొలంలో దొరికిన పాడైన పుట్టుగొడుగులు తిని తీవ్ర అస్వస్థకు గురైన విషయం తెలిసిందే. దాంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీహెచ్ఓ జయచంద్రకుమార్, సూపర్ వైజర్ గోవిందప్ప, గోపీ, గంగాధర్, సుచిత్ర తదితరలు మంగళవారం ఆదెప్పల్లి గ్రామానికి వెళ్లి విషతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. పుట్టుగొడుగులు లేతగా ఉన్నవి ఆహారంగా తీసుకోవచ్చని, వాటిని విచ్చుకున్న తరువాత ఆహారంగా తీసుకుంటే అవి విషంగా మారే అవకాశం ఉందన్నారు.

చెరువులోపడి గొర్రెల కాపరి మృతి

పెనుకొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులోపడి రామాంజినరెడ్డి(60) అనే పశువుల కాపరి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన పశువుల కాపరి రామాంజినరెడ్డి పశువులను మేపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా రామాంజినరెడ్డి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం అతడు పశువులను మేపడానికి గ్రామం సమీపంలోకి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం బొమ్మిరెడ్డిపల్లి చెరువులో శవమై తేలాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చెరువులోపడ అతడి మృతదేహాన్ని వెలికి తీసి, పెనుకొండ ఆసుపత్రికి తరలించారు.

సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

హిందూపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై శిక్షణ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యుడితోపాటు సానుభూతిపరులు, పార్టీ శ్రేయోభిలాషులు మంచిప్రవర్తన గల వ్యక్తులకు పార్టీసభ్యత్వం ఇవ్వాలన్నారు. ఇతర పార్టీలవారికి ఎలాంటి పరిస్థితుల్లోనూ సభ్యత్వం చేయరాదన్నారు. పట్టణాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత పాపం.. వందలాది మందికి శాపం

- ● ఆర్‌అండ్‌బీ మోరీని మట్టితో పూడ్చిన వైనం
- ● 40 ఎకరాల్లో నీటమునిగిన మొక్కజొన్న, వేరుశనగ
- ● మరో 10 రోజుల్లో కోతకు సిద్ధం
- ● ఇంతలో కొంపముంచిన వర్షం


మట్టితో పూడ్చివేసిన మోరీ

హిందూపురం అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఇంటిల్లి పాది 9 మంది కలిసి మూడు నెలలు రాత్రి పగలు కష్టపడ్డాము. మరో పది రోజుల్లో పంట చేతికి వస్తుంది అనుకున్నాము. చేసిన అప్పులు తీరుతాయని ఆశగా కళ్లలో ఒత్తులు వేసుకొని పంటను కాపాడుకుంటు వచ్చాము. ఇంతలో వర్షం కురవడం పంట నీటి మునగడం జరిగిపోయింది. ఇంకేముంది చేతిలో ఉన్న కూడు నోటికాడకు రాకుండా రాలిపోయింది. మాకు దిక్కెవరు? మమ్ములను ఎవరు ఆదుకుంటారుఅప్పులెలా తీర్చాలి?' అంటూ కెంచనపల్లి రైతులు బోరున విలపిస్తున్నారు. దీని కంతటికీ కారణం సమీపంలోని మోరీని పూడ్చివేయడమే.

హిందూపురం మండలంలోని కెంచనపల్లి గ్రామానికి చెందిన రైతులు మొక్కజొన్న, కొంత భాగం వేరుశనగ సాగుచేశారు. అయితే ఎగువ కర్ణాటక నుంచి వస్తున్న నీరు కాలువలు ద్వారా చెరువుకు చేరాల్సి ఉంది. కానీ జుమాకులపల్లికి చెందిన ఓ వైసీపీ నాయకుడు తన భూమిలో నుంచి ఆర్‌అండ్‌బి మోరి ద్వారా నీరు చెరువుకు వెళుతోందని, అలావెళ్లడానికి వీలు లేదని గత ప్రభుత్వ హయాంలో మోరీని మట్టితో మూసివేశాడు. దీంతో కాలువ ద్వారా నీరు చెరువుకు చేరాల్సి ఉండగా మోరీ మూసివేయడంతో నీరు పంట పొలాల్లోకి చేరింది. దీంతో దాదాపుగా 40 ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ నీటమునిగాయని రైతులు బోరుమన్నారు. నడుం లోతు నీరు చేరడంతో నీరు బయటకు వెళ్ళే మార్గం లేక వేర్లు కుళ్లిపోయి చేతికొచ్చిన పంట గంగపాలైందని విలపించారు. ఒకరు చేసిన పాపం వందలాది కుటుంబాలకు శాపంగా మారిందన్నారు. ఇప్పటికే నీరు రోడ్డు మీదకు కూడా వచ్చిందని మరో మారు మంగళవారం వర్షం కురిస్తే నీరు ముందుకు కదిలే వీలు లేకుండా రహదారి మొత్తం నిండిపోతుంది. దీంతో మానెంపల్లి, జుమాకులపల్లి, విభూదిపల్లి, పులమతి, శిరివరం తదితర గ్రామాల నుంచి సమీపంలోని పరిశ్రమలకు వెళ్లేవారికి దారిలేకుండా పోతుంది. ఇప్పటికే లక్షల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు విలపించారు. మరో మారు నీరు చేరితే పశువులకు గడ్డికూడా మిగలదని ఆవేదన చెందారు. అధికారులు, నాయకులు స్పందించకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

10 రోజుల్లో కోతకొచ్చేది...


శివమ్మ

ఇంటిల్లి పాది రాత్రి పగలు కష్టపడ్డాము. చంటి బిడ్డలా కంటికి రెప్పలా పంటను కాపాడుకొచ్చాము. మరో పది రోజుల్లో కోత కోయాల్సి ఉంది. ఇంతలో ఇలా రెండు ఎకరాల పంట నీటి మునిగింది. మమ్ములను కాపాడేదెవరు. అప్పులు ఎలా తీర్చుకోవాలి.

ఎకరాకు రూ. 40 వేలు ఖర్చయింది


మారుతి

రూ.40 వేలు ఖర్చు చేసి ఒక ఎకరంలో వేరుశెనగ వేశా. పంటను కోసి పొలంలో ఉంచాను. ఉదయం కాయలు వేరు చేయాల్సి ఉంది. ఇంతలో రాత్రికి రాత్రి నీరు చుట్టేసింది. పంట మొత్తం నీటిలో మునిగిపోయింది. కాయ కష్టం చేసిన శ్రమ అంతా మోరీతో నీటిపాలైంది.

సభ్యులందరినీ గౌరవిస్తాం: ఎంపీపీ

●ఎట్టకేలకు గోరంట్ల సర్వసభ్య సమావేశం నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గోరంట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలసర్వసభ్య సమావేశంలో సభ్యులందరిని సముచితం గా గౌరవిస్తామని, అభివృద్ధి పనులు అవసరమైతే తనను, ఎంపీడీఓను సంప్రదించాలని ఎంపీపీ ప్రమీల సభ్యులను కోరారు. కోరం లేని కారణంగా వాయిదా పడిన మండలసభ మంగళవారం నిర్వహించగా, 22మంది ఎంపీటీసీలకు గాను 10మంది సభ్యులు రావడంతో సమావేశాన్ని ఎంపీడీఓ నరేంద్రకుమార్ ప్రారంభించారు. పాఠశాలలలో 75శాతం విద్యార్థులు హాజరైతేనే తల్లికి వందనం వర్తిస్తుందని ఎంఇఓ జాన్‌రెడ్డెప్ప తెలిపారు. 24శాతం మంది విద్యకు దూరంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ప్రతిఒకరు పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందని, దీనికి గత 12యేళ్లుగా ఒకే రకం కె-6 వేరుశనగను రైతులు సాగుచేయడమే కారణమని ఎఓ మునిక్రిష్ణ తెలిపారు. కొండాపురం ఎంపీటీసీ సునంద మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన మొక్కజొన్న విత్తనాలు, మందులు అందించకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. నకిలీ విత్తనాల వలన పండిన పంట దిగుబడి రాక పోతే రైతులు ఎలా బాగుపడుతారన్నారు. ఉపాధి పనులను వేసవిలో మాత్రమే నిర్వహించాలని, పంట కాలంలో కూలీలు రాక, రైతులు వారి కాళ్లు పట్టుకుని ప్రాధ్యాపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆమె ఆసహనం వ్యక్తం చేశారు. రైతుల గోడును ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలవాలన్నారు. మల్లాపల్లి హెల్త్‌సెంటర్ నూతన భవనం యేడాది క్రితమై ప్రారంభమైనా అందులో ఆస్పత్రి నిర్వహించడానికి సర్పంచ్ శివానంద్ సెక్యూరిటీ పేరుతో అడ్డు పడుతున్నారని మెడికలాధికారి శృతి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసమావేశానికి తహసీల్దార్ మారుతి, జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్, వైస్ ఎంపీపీలు నాగభూషణరెడ్డి, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే హంద్రీనీవా కాలువ గండి పూడ్చండి

●బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

పెనుకొండ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సోమందేపల్లి మండలంలోని హంద్రీనీవా సుజలస్రవంతి కాలువకు మంగళవారం పడిన గండిని తక్షణమే పూడ్చాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ఆమెఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. సోమవారం సాయంత్రం నుంచి కురిసిన భారీవర్షాలకు సోమందేపల్లి మండలం మంచేపల్లిలో హంద్రీనీవా కాలువకు గండిపడిందన్న విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించారు. తక్షణమే నీరు వృధాకాకుండా అరికట్టాలని అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం వరదనీరంతా పందిపర్తి, మంచేపల్లి, చెరువులకు వెళ్తుందని ఆ చెరువులకు వెళ్లి ఈదులబళ్లాపురం చెరువుకు వెళ్తుందన్నారు. నీరు వృధాకాకుండా పడిన గండిని పూడ్చాలన్నారు. నిండిన చెరువుల కట్టలను బలోపేతం చేయాలని కోరారు.

తొలగించిన బస్సులను పునరుద్ధరించండి

హిందూపురం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎవరకి చెప్పకుండా ఏకపక్షంగా తొలగించిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు తెలియజేస్తూ డిఎం శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. ఆర్టీసీ బస్సులు అంటేనే ప్రభుత్వ బస్సులని, ఆ సంస్థ ప్రజల సౌకర్యాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా సర్వీసులు నడపాల్సి ఉంటుందని, అయితే ప్రైవేట్ బస్సులకు అనుకూలించే విధంగా ఆర్టీసీ బస్సులను ఏ పక్షంగా తొలగించడం ఏంటని యూనియన్ నాయకులు ప్రశ్నించారు. బెంగళూరు, పావగడ, నంద్యాల, కొడికొండ చెక్‌పోస్ట్ కడప, బళ్ళారి, సర్వీసులు తొలగించారన్నారు. ఆ సర్వీసులను వెంటనే పునరుద్ధరించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా కండీషన్ లేని బస్సులను మెరు గు పరచాలన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు డ్రైవర్, కండక్టర్ ప్రాణాలు కూడా ముఖ్యమన్నారు. గ్యారీజీలలో రిపేరి చేయడానికి సరైన పని ముట్లు ఏర్పాటు చేయాలని, విడిభాగాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈడిసి షఫ్లింగ్ వెంటనే చేయాలన్నారు. తదితర సమస్యలపై డిఎంకు వినతి అందించారు. కార్యక్రమంలో డిపో చైర్మెన్ కిరణ్‌కుమార్, రాజారెడ్డి, టిఎస్ నాథ్, తిప్పారెడ్డి, షబ్బీర్, విజయలక్ష్మి, బాషా, మారుతి, కిష్టప్ప, వక్కల రాజా తదితరులు ఉన్నారు.

నీట మునిగిన వరిపంట


నీటిమడుగుగా మారిన వరి మడి

సోమందేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకలపల్లి చెరువు నిండి మరువ పారడంతో చెరువుకింద ఉన్న వంద ఎకరాల్లో వేసుకున్న వరిపంట పూర్తిస్థాయిలో మునిగింది. సోమవారం రాత్రి కురిసిన భారీవర్షాలకు వరదనీరు పోటెత్తి చెరువు నిండి మరువపారడంతో ఆ నీరు పొలాలను ముంచెత్తింది. స్థానికులు మాట్లాడుతూ ఆకస్మికంగా వరద పోటెత్తడంతో పొలాలు నీట మునిగాయన్నారు. దాదాపు రూ.10లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు వీధిదీపాల ఏర్పాటు



మడకశిర టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలోని 16వవార్డు సి.సి.బండ, నాగన్న కుంట తదితర కాలనీల్లో మంగళవారం ఎట్టకేలకు నగర పంచాయతీ అధికారులు విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి ఇటీవల సమస్యను కాలనీ వాసులు తీసుకెళ్లారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు లేకపోవడం వల్ల బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, విష పురుగులు సైతం పారాడుతుంటాయని, సమస్యలు పరిష్కరించాలని కోరగా అందుకు స్పందించిన అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

అమరాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని పుల్లీకుంట గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీఓ రామారావు మండల కన్వీనర్ గణేషులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాలను, పట్టణ ప్రాంతాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆంధ్రరాష్ట్రాన్ని అన్ని విధాలుగా అగ్రగామి రాష్ట్రంగా అభివృద్ధి చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహామూర్తి, ఎంపీడీఓ రామారావు, ఏపీఓ జగదీష్, జేఈ జగదీష్, మండల కన్వీనర్ గణేష్, మద్దనకుంట సర్పంచి గోవిందప్ప, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పెనుకొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లి గ్రామంలో సీనియర్ టీడీపీ నాయకులు ఇస్మాయిల్‌ఖాన్‌ను టీడీపీ నాయకులు పరామర్శించారు. పాముకాటుకు గురై అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి సతీమణి కమలమ్మ, అల్లుడు శశిభూషణ్ పటేల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఇస్మాయిల్‌ఖాన్ ఆరోగ్యపరిస్థితిని వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యంతోపాటు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

అమరాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని ఉదుగూరు గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌మీద కర్ణాటక మద్యాన్ని తీసుకొని వస్తుండగా కర్ణాటక రాష్ట్రం కళారాజనహళ్లి క్రాస్ వద్ద ఉన్న ఎవర్‌గ్రీన్ రెస్టారెంట్ నుండి 40 రాజా ప్యాకెట్లు విస్కీ, 90 ఎంఎల్ కర్ణాటక మద్యం ప్లాస్టిక్ ప్యాకెట్లను తీసుకొని వస్తుండగా పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారని ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఘనంగా పల్లెపండుగ వారోత్సవం

మడకశిర టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని మల్లినమడుగు, బి.జి.హళ్లి, హెచ్‌టీ హళ్లి గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలు జరిగాయి. మొదటగా బి.జి.హళ్లి కల్వర్టుకు భూమిపూజ నిర్వహించి అనంతరం మల్లినమడుగు సీసీరోడ్డు భూమిపూజ నిర్వహించారు.